www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -353 మంగళవారం 31 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

**ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ**



**హైదరాబాద్ మార్చి: 30ప్రజావినికిడి**
గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు రెడీ చేశామని అన్నారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల డ్రాఫ్ట్ బిల్లుపై కంపెనీలతో 5 సార్లు మీటింగులు పెట్టామని...**మిగతా 2లో...**

## 50 శాతం సీట్లు పెంపువెనక పెద్ద కుట్ర

- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ
- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



2లో.




## దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

- 'సహజీవన జంటలకు' కూడా కుటుంబ హోదా
- 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన జనగణన ప్రక్రియ
- ఈసారి జనాభా లెక్కల్లో సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల మార్పు

2లో.

## ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

**త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి**

**మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్**

**వాషింగ్టన్,, మార్చి: 30ప్రజావినికిడి** :ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం **మిగతా 2లో...**




## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

**బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా**



**పాట్నా, మార్చి: 30ప్రజావినికిడి**
బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు**మిగతా 2లో...**

## తిరుపతిలో పీ4 వార్షికోత్సవం...

- మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు
- విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న పీ4 కార్యక్రమం
- తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో వార్షికోత్సవం
- ఆకట్టుకున్న ప్రత్యేక ఆడియో, వీడియో (ఏవీ) ప్రదర్శన
- మార్గదర్శులు, లబ్ధి పొందిన బంగారు కుటుంబాలతో ముచ్చటించిన చంద్రబాబు



2లో.

## రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన

- మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్
- ఒకరోజు బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్
- శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి



2లో.

## నక్సలిజం దాదాపు అంతమైంది



- చర్చల ద్వారా సమస్యల పరిష్కారం
- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిడిపిన మావోయిస్టులు
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన

**న్యూఢిల్లీ, మార్చి: 30ప్రజావినికిడి** :చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు.
**మిగతా 2లో...**

## పొంగులేటిని బర్తరఫ్ చేయాలి



2లో.

- మంత్రి అక్రమాలపై స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలి
- అక్రమ మైనింగ్, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు..సాక్ష్యాధారాలు అందజేత

## సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వడ్డీ రేట్లు యథాతథం



2లో.

# నక్సలిజం దాదాపు అంతమైంది

**మొదటిపేజీ తరువాయి**

మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం‘ అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. ‘నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. ‘రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

# గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

**మొదటిపేజీ తరువాయి**

చట్టం తీసుకొస్తే కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని వివరించామన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అండగా స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు వివేక్. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు ’సామాజిక భద్రత , సంక్షేమ బోర్డు’ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది.ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా.. తక్షణమే ఫిర్యాదు చేసేందుకు ’ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు’ జిల్లా స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉంటుంది. ఇంతకాలం యాప్ కంపెనీలు ఏ ప్రాతిపదికన ఆర్డర్లు ఇస్తున్నాయి, పేమెంట్లు ఎలా లెక్కిస్తున్నాయి అనే దానిపై స్పష్టత ఉండేది కాదు. ఇకపై యాప్ కంపెనీలు ఇష్టమొచ్చినట్లు రేట్లు తగ్గించడం, కార్మికులను ఇబ్బంది పెట్టడం కుదరదు. కార్మికులకు ఇచ్చే పేమెంట్లలో పారదర్శకత ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తారు.

# ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ఎ÷-లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం‘ అని హెచ్చరించారు.

# బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

**మొదటిపేజీ తరువాయి**

ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు.

ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దుతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

# తిరుపతిలో పీ4 వార్షికోత్సవం...

**మార్చి: 30ప్రజావినికిడి**

పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్షేమ పథకాలకు భిన్నంగా, మానవతా దృక్పథంతో పేద కుటుంబాలను ఆదుకునే ఈ వినూత్న కార్యక్రమం ద్వారా సాధించిన ప్రగతిని ఈ వేడుకల్లో వివరించారు.ఈ కార్యక్రమంపై రూపొందించిన ప్రత్యేక ఆడియో, వీడియో (ఏవీ) ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. పీ4 కార్యక్రమం ద్వారా గత ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 10.39 లక్షల పేద కుటుంబాలను ‘మార్గదర్శులు‘ దత్తత తీసుకున్నట్లు ఏవీలో వెల్లడించారు. వీరిలో ఇప్పటికే 2.1 లక్షల కుటుంబాల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురాగలిగామని తెలిపారు. సమాజంలోని ధనిక వర్గాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ‘మార్గదర్శులు‘గా వ్యవహరిస్తూ పేద కుటుంబాలను ‘బంగారు కుటుంబాలు‘గా దత్తత తీసుకుంటున్నారు. వారికి జీవనోపాధి మార్గాలు చూపడం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ, పిల్లల చదువుకు చేయూత, గృహ నిర్మాణం వంటి అనేక రూపాల్లో సహాయం అందించి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మార్గదర్శులు, లబ్ధి పొందిన బంగారు కుటుంబాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నేడు లబ్ధి పొందుతున్న బంగారు కుటుంబాలు భవిష్యత్తులో ఇతరులకు సహాయం చేసే మార్గదర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కేవలం ప్రభుత్వ పథకాలతోనే కాకుండా, పౌర సమాజ భాగస్వామ్యంతో పేదలను పైకి తీసుకురావాలనే ఆలోచన అద్భుతమని పలువురు మార్గదర్శకులు ప్రభుత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో సరికొత్త సామాజిక మార్పుకు నాంది పలుకుతోందని అభిప్రాయపడ్డారు.

# సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వడ్డీ రేట్లు యథాతథం

**న్యూఢిల్లీ,,మార్చి: 30ప్రజావినికిడి**




చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి పథకాల వడ్డీ రేట్లలో వరుసగా ఎనిమిదోసారి ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి వర్తించిన వడ్డీ రేట్లు ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు కొనసాగుతాయని ఆర్థిక శాఖ తెలిపింది.సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకం కింద చేసే డిపాజిట్లకు 8.2 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. మూడేళ్ల కాలపరిమితి డిపాజిట్లకు 7.1 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. పీపీఎఫ్‌కు 7.1 శాతం వడ్డీ రేటు వర్తిస్తుంది. పోస్టాఫీస్ పొదుపు డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్లలో మార్పులేదు.పోస్టాఫీస్ డిపాజిట్లపై 4 శాతం వడ్డీ రేటు కొనసాగుతుంది. కిసాన్ వికాస్ పత్ర పథకానికి 7.5 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకానికి 7.7 శాతం, పోస్టల్‌లో నెలవారీ ఆదాయ పథకంపై (ఎంఐఎస్) 7.4 శాతం వడ్డీ రేటు కొనసాగుతుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం చివరిసారి 2023-24 నాలుగో త్రైమాసికంలో వడ్డీ రేట్లను సవరించింది.

# దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన...

**న్యూఢిల్లీ, మార్చి: 30ప్రజావినికిడి**

భారతదేశ జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 2021లో కోవిడ్ కారణంగా వాయిదా పడిన 16వ జనగణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. ఈసారి జనాభా లెక్కల్లో మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలను సవరించారు. ఇందులో భాగంగా, చాలా కాలంగా కలిసి ఉంటున్న సహజీవన జంటలను ఇకపై ‘కుటుంబం‘గా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఈరోజు వివరాలను వెల్లడించారు.

**రెండు దశల్లో జనగణన:**

తొలి దశ (ఏప్రిల్ 1 నుంచి): ఈ దశలో ‘గృహ గణన‘ (చేపడతారు. అధికారులు మొబైల్ యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి గృహాల వివరాలను సేకరిస్తారు.

రెండో దశ (వచ్చే ఏడాది ఫిబ్రవరి): ఈ దశలో అసలైన జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. జనగణన కోసం కేంద్రం ప్రత్యేకంగా 33 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇందులో కుటుంబ యజమాని వివరాలు, కులం, కమ్యూనిటీతో పాటు ఇంట్లోని వసతులపై ఆరా తీయనున్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్ నుంచి కారు వరకు), టీవీ, రేడియో వంటి గృహోపకరణాలపై ప్రశ్నలు ఉంటాయి. తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వినియోగం, వంటగది సౌకర్యాలు, వినియోగించే ఇంధనం మరియు తృణధాన్యాల వాడకం వంటి వివరాలను సేకరిస్తారు.ఈసారి జనగణనలో మరో విశేషం ఏమిటంటే, పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. దేశంలో సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన జరుగుతుంది. చివరిసారిగా 2011లో జనాభా లెక్కలు సేకరించగా, దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఈ గణాంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు, నిధుల కేటాయింపులకు అత్యంత కీలకం కానున్నాయి.

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

**హైదరాబాద్ మార్చి: 30ప్రజావినికిడి**



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఆయన అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సోమవారం హైదరాబాద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సాక్ష్యాధారాలను అందజేసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అక్రమాలపైన స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలనీ, లేదంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేసింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని తెలిపింది. జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడిందని విమర్శించింది.

సంబంధం లేని భూమిని చెరబట్టి ఎలాంటి మినరల్ డీలర్ లైసెన్స్, పొల్యూషన్ బోర్డు అనుమతి, విద్యుత్ కనెక్షన్లు, పరిశ్రమల శాఖ అనుమతి లేకుండా రెండేండ్లుగా రూ.వందల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టిందని వివరించింది. మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరితే సభ నుంచి తమను ప్రభుత్వం బహిష్కరించిందని తెలిపింది. అనంతరం మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. శాసన సభా సంఘాన్ని ఏర్పాటు చేస్తే అన్ని వాస్తవాలూ బయటకు వస్తాయని చెప్పారు.మంత్రి పొంగులేటి రూ.వందల కోట్ల అక్రమ మైనింగ్‌తోపాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయన్నారు. ప్రభుత్వ ఏజెన్సీలతోనే విచారణ జరిపిస్తామంటున్నారనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే స్వయంగా హోంమంత్రి బాధ్యతల్లో ఉన్నపుడు సీబీసీఐడీ విచారణ లేదా రాష్ట్ర హోం శాఖ అధికారులతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. అందుకే ఒక శాసనమండలి, శాసనసభ్యులతో కూడిన సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదా స్వతంత్ర న్యాయ విచారణ, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని గవర్నర్‌కు వివరించామన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఇందిరమ్మ పాలన రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ దోపిడీని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని చెప్పారు. బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు.

రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్‌ను రూట్ టు ఇన్‌కంగా ఆయన మార్చుకున్నారని వివరించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఆయనకు తెలిసినంతగా ఈ దేశంలో మరెవరికీ తెలియవన్నారు. 14 అంశాలపై విచారణ చేయాలంటూ సీఎంకు లేఖ రాశామని గుర్తు చేశారు. వాటిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే పొంగులేటిని బర్తరఫ్ చేసి విచారణ జరపాలన్నారు. మంత్రిగా ఉన్నందున ఆయన విచారణను ప్రభావితం చేసే అవకాశముందని చెప్పారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంలో సాక్ష్యాధారాలను ఇచ్చినా బీజేపీ మౌనంగా ఉందనీ, ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, పొంగులేటి అక్రమ మైనింగ్, భూకబ్జాలపైన త్వరలోనే మరింత కార్యాచరణ ప్రకటిస్తామని వివరించారు.

# రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన

**మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్**

**ఒకరోజు బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్**

**శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి**

**హైదరాబాద్,మార్చి: 30ప్రజావినికిడి**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఒక్క రోజు సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరిస్తున్నట్లుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసింది. అసెంబ్లీ సెషన్ ముగిసేవరకూ సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరించింది. దీంతో పొంగులేటి కంపెనీ అవినీతిపై మండలిలో బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. పొంగులేటిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అవినీతిపై సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా మండలి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇలా మండలి సభ్యులపై సస్పెన్షన్ వేటు పడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, సస్పెన్షన్‌కు నిరసగా బీఆర్ఎస్ మండలి సభ్యులు చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో మండలి సభ్యులను మార్షల్స్ బలవంతంగా లాక్కెళ్లారు. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాని.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. చైర్మన్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ అంశంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభలో సీఎం రేవంత్ స్పష్టం చేశారని చెప్పారు. సభ సజావుగా సాగేందుకు బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని కోరారు. మరోవైపు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా సభా కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలని పదే పదే కోరారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన కొనసాగించడంతో వారిని సస్పెండ్ చేయాలని మంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో ఒకరోజుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ఇప్పటికే అసెంబ్లీలో కూడా బిఆర్ఎస్ సభ్యులను ఆదివారం సస్పెండ్ చేశారు. సోమవరంతో అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నాయి.

# 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర

**హైదరాబాద్,మార్చి: 30ప్రజావినికిడి**

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు.ం

## ఎల్లమ్మ ఆలయం ఉపాధ్యక్షులుగా చంద్రపాల్ ఎన్నిక






**ప్రజావినికిడి, (రామాంతపూర్):** రామంతపూర్ భరత్ నగర్ శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం నూతన కమిటీ ఎన్నికను భరత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్ రామిరెడ్డి అధ్యక్షతన ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్. రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏ.చంద్రపాల్, జనరల్ సెక్రటరీగా రాపోలు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏ.రవికుమార్, జాయింట్ సెక్రటరీగా ఎం. రమేష్, కోశాధికారిగా బీ.సుధాకర్ రావును సలహాదారులుగా బీ.నాగిరెడ్డి, సత్యనారాయణ గౌడ్,పీ.జానయ్య గౌడ్,టీ.అరవింద స్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా కే.బాల్ రెడ్డి, ఈ.సీతయ్య, ఏ.రాము యాదవ్, బీ.కిషోర్,ఎం.రవి, కే.రామ్ ప్రసాద్, ఆర్.వెంకట రమణారావు, యూ.సిద్దయ్య గౌడ్ లను సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.కమిటీ సభ్యులను ఎన్నుకోవడానికి సహకరించిన కాలనీవాసులందరికీ ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## ఎంఎన్ జె క్యాన్సర్ ఆస్పత్రిలో అన్నదానం



**ప్రజావినికిడి, (నాంపల్లి):** ఎంఎన్ జె క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు వారి సహాయకులకు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీఓ) కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ (ముజీబ్) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి వారం క్రమం తప్పకుండా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ వారం కూడా డాక్టర్ ముజీబ్ స్వయంగా పాల్గొని రోగులకు భోజనాన్ని వడ్డించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చికిత్స కోసం దూర ప్రాంతాల నుండి వచ్చే పేద, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన రోగులు,వారి సహాయకులు ఆకలితో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. మానవత్వం,సేవా భావం ప్రధానంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా మరింత విస్తృతంగా ఈ సేవలను కొనసాగించనున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు ఖలీద్ అహ్మద్,బోలిగిద్ద శంకర్,ఈసీ సభ్యులు శ్రీధర్ పాల్గొన్నారు. అదేవిధంగా, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆస్పత్రి యూనిట్ ప్రెసిడెంట్ బి.శివకుమార్, కార్యదర్శి చంద్ర శేఖర్,కమ్రాన్, ఈ.ఎన్.టి ఆస్పత్రి యూనిట్ అధ్యక్షులు టి.రాజు హైదరాబాద్ జిల్లా ఏపీఆర్వో మహ్మద్ వహీద్,మహ్మద్ ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

## పౌండేషన్ లెర్నింగ్ స్టడీ, కేంద్ర ప్రభుత్వ సర్వే



**ప్రజావినికిడి,(వాజేడు):** రాష్ట్రంలో 407 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో మూడవ తరగతి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం పరీక్షించేందుకు ఈనెల 30 31న ఫౌండేషన్ లెర్నింగ్ స్టడీ (ఎఫ్ఎల్ఎస్) పేరిట కేంద్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఎంపీ యుపిఎస్ జగన్నాధపురం, ఎంపీపీఎస్ చెరుకూరు పాఠశాలల్లోని మూడవ తరగతి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించడానికి కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ వచ్చి విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరీక్షించడం జరిగింది.మూడవ తరగతి విద్యార్థులకు సామర్థ్యాలను పరీక్షిస్తున్న సమయంలో ములుగు జిల్లా ఉల్లాస్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణ బాబు, వాజేడు మండల విద్యాధికారి తేజావత్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించడం జరిగింది. ఎఫ్ఎల్ఎస్ ఫీల్డ్ ఇన్వెస్టర్లుగా డిఈడీ విద్యార్థులు అయినా వైష్ణవి, అంజలి, పాల్గొన్నారు

## ముగిసిన బిజెపి కొందుర్గు ఉమ్మడి మండల ప్రశిక్షణా శిబిరం





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్య సమాజ మందిరంలో ఆదివారం రోజు ప్రారంభమైన బిజెపి ఉమ్మడి కొందుర్గు మండల ప్రశిక్షణా శిబిరం బిజెపి కొందుర్గు,చౌదరిగూడ మండలాల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి,ఎదిర రాజు ఆధ్వర్యంలో సోమవారం రోజు విజయవంతంగా ముగిసింది.పార్టీ బలోపేతంకై నాయకులు, కార్యకర్తలు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి వక్తలు పలు అంశాలపై అవగాహన కల్పించారు.నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కమ్మరి భూపాల చారి,కందూరి మనోహర్ రెడ్డి,మచ్చ సుధాకర్ రావు,బోయ శంకర్,మంగన్నగారి బల్వంత్ రెడ్డి,ఈసరి సత్యం, బోయ కురుమయ్య,కోనేరు శ్రీనివాస్,కొమరబండ శ్రీశైలం, పర్వతాపూర్ సర్పంచ్ అశోక్, నవీన్, నరసింహ,సుధాకర్,రాజు, చంద్రశేఖర్ చారి,గోపాల్, బూత్ కమిటీ అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలతో ప్రాణాలు పోతున్న
# పట్టించుకోరా..

### ప్రజల ఫిర్యాదులపై అధికారుల స్పందన ఉండదా..
### చర్యలు తీసుకోమంటే సెటిల్మెంట్ చేసుకొని మౌనంగా ఉన్నారా..
### జిహెచ్ఎంసి అధికారుల తీరుపై ఎం ఆర్ శ్రీనివాస్ ఆగ్రహం..





TELANGANA PRADESH CONGRESS COMMITTEE
GANDHI BHAVAN, HYDERABAD - 500001

M.R. Srinivas Rao
(Ex.Corporator)
Secretary

H.No. 12-1-761, Shanthi Nagar,
North Lalaguda, Secunderabad - 500017.
Cell : 9848309013, 8008404688
E-mail: mr.crop141@gmail.com

శ్రీయుత గౌరవనీయులైన జోనల్ కమిషనర్ గారికి,
నార్త్ జోన్ సికింద్రాబాద్, జిహెచ్ఎంసి

27/2/26

విషయం: తార్నాక సర్కిల్ పరిధిలో మధుర నగర్‌లో జరిగిన ప్రమాద మరణం నేపథ్యంలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి.

సార్.

తార్నాక సర్కిల్ పరిధిలోని బౌద్ధ నగర్, సీతాఫలమండి డివిజన్ మధుర నగర్ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణ పనుల సమయంలో కూలి పని చేసుకునే కార్మికుడు రాజు బిల్డర్ నిర్లక్ష్యంతో కిందపడి మరణించిన దుర్ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ సంఘటన అక్రమ నిర్మాణాలు ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో స్పష్టంగా తెలియజేస్తోంది.

సదరు నిర్మాణంలో తగిన భద్రతా చర్యలు, సేఫ్టీ కిట్లు, అనుమతులు లేకుండా పనులు జరిపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తి ప్రాణ నష్టం మాత్రమే కాకుండా, మున్సిపల్ అధికార యంత్రాంగం పర్యవేక్షణలో ఉన్న లోపాలను కూడా బహిర్గతం చేస్తోంది.

కాబట్టి, మీరు వెంటనే క్రింది చర్యలు తీసుకోవాలని వినతిచేస్తున్నాము:

1) తార్నాక, మెట్టుగూడ, పద్మారావు నగర్, మధురానగర్ పరిధిలో జరుగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలను తక్షణమే సీజ్ చేయాలి.
2) అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.
3) భవన నిర్మాణాల్లో కార్మికుల భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి.
4) టౌన్ ప్లానింగ్ అధికారులు, చైన్ మెన్ లు, న్యాక్ ఇంజనీర్ల నిర్లక్ష్యంపై విచారణ జరపాలి.
5) ఇకపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
6) రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని అపార్ట్మెంట్లు, కమర్షియల్ నిర్మాణాలు చేస్తున్న బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మనవి.

ధన్యవాదాలు.
ఎం ఆర్ శ్రీనివాసరావు

Office of The Zonal Commissioner Sec'bad Zone GHMC
Inward No. 653
Dt: 27/2/26

**ప్రజావినికిడి,(తార్నాక):** తార్నాక సర్కిల్ పరిధిలో అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారా లేదా అన్న సందేహం వ్యక్తమవుతోందని టిపిసిసి కార్యదర్శి ఎం ఆర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా మధురానగర్‌లో జరిగిన విషాద ఘటన ఈ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది.

మధురానగర్‌లో అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగుతున్న భవనంలో పని చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు పై అంతస్తు నుండి కిందపడిపడి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది.ఈ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టిపిసిసి కార్యదర్శి ఎం.ఆర్. శ్రీనివాసరావు ఫిబ్రవరి 27న తార్నాక సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తోందన్నారు.

ఈ సందర్భంగా ఎం.ఆర్. శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల ప్రాణాలు తీస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు లంచాలు తీసుకుని వాటిని ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆరోపించారు. మున్సిపల్ నిబంధనలను పూర్తిగా పక్కనపెట్టి నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ,డిప్యూటీ కమిషనర్,టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం పరిశీలన చేయకుండా ఉండటం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి,ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి అక్రమ నిర్మాణాలు కొనసాగుతుంటే వాటిని నిలిపివేయాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. మధురానగర్ ఘటనలో కార్మికుడి మృతి జరిగినప్పటికీ ఇప్పటికీ ఆ భవనం పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తార్నాక సర్కిల్ అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ ఘటనను మున్సిపల్ అధికారులు తేలికగా తీసుకోవడం ప్రజలలో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోందన్నారు.

అక్రమంగా నిర్మించిన భవనాన్ని వెంటనే కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు.భవన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసిన అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించిన అధికారుల పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఎం ఆర్ కోరారు. లేకపోతే ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సికింద్రాబాద్ జోన్, తార్నాక సర్కిల్ అధికారుల బాధ్యతారాహిత్యాన్ని బహిర్గతం చేస్తామని హెచ్చరించారు.

ఇటీవల నగరంలో చోటుచేసుకుంటున్న అక్రమ నిర్మాణాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ సంఘటన మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజల భద్రతను పక్కనబెట్టి జరుగుతున్న నిర్మాణాలు ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలకు దారితీస్తాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

జిహెచ్ఎంసి కమిషనర్ వెంటనే స్పందించి సికింద్రాబాద్ జోన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎం ఆర్ కోరారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని ఎం ఆర్ శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు

# ఏపీ పోలీసులకు భారీ విజయం
### మావోయిస్టు అగ్రనేత లొంగుబాటు






**ప్రజావినికిడి,(అమరావతి):** ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుమారు 36 ఏళ్లుగా అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న సీపీఐ (మావోయిస్టు) అగ్రనేత చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్ సహా మొత్తం 9 మంది మావోయిస్టు కేడర్లు రాష్ట్ర పోలీసులకు లొంగిపోయారు.

డీజీపీ హరీష్‌కుమార్ గుప్త సమక్షంలో ఈ లొంగుబాట్లు చోటుచేసుకున్నాయి.లొంగిపోయిన వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు (సిసిఎం) స్థాయి నాయకుడు ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

రూ.25 లక్షల బహుమతి, పునరావాసం

ప్రభుత్వ సరెండర్ & రీహాబిలిటేషన్ పాలసీ కింద చెల్లూరి నారాయణరావుకు రూ.25 లక్షలు ఇతర కీలక కేడర్లకు రూ.45 లక్షల వరకు

మిగతా సభ్యులకు రూ.1 లక్ష చొప్పున ప్రోత్సాహకాలు డిజిపి ప్రకటించారు.

తక్షణ సహాయంగా ప్రతి ఒక్కరికి రూ.20 వేల చొప్పున అందజేశారు.ఈ

ఆపరేషన్లలో భారీగా ఆయుధాలు స్వాధీనం



పోలీసులు గూఢచారి సమాచారం ఆధారంగా నిర్వహించిన ఆపరేషన్లలో 303 రైఫిళ్లు, బీజిల్ ఆయుధాలు

పేలుడు పదార్థాలు, డెటోనేటర్లు

కార్డెక్స్ వైర్లు, మాన్‌ప్యాక్స్

మొత్తం 19 ఆయుధాలు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ప్రతిఏటా మావోయిస్టులకు భారీ దెబ్బలు తగ్గుతున్నాయి.గత ఏడాది పోలీసుల చర్యల్లో 7 ఎన్‌కౌంటర్లలో18 మంది మావోయిస్టులు హతం కాగా 81 మంది అరెస్టు అయినారు.

106 మంది లొంగుబాటు

మొత్తం 205 మంది మావోయిస్టులపై చర్యలు తీసుకున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ సరిహద్దులలో

మావోయిస్టుల ప్రభావం శూన్యానికి

పోలీసుల నిరంతర చర్యలతో రాష్ట్రంలో అండర్‌గ్రౌండ్ మావోయిస్టు కేడర్ సంఖ్య శూన్యానికి చేరిందని డీజీపీ వెల్లడించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి), గ్రేహౌండ్స్ బలగాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ప్రశంసించారు.

లొంగుబాటుకు కారణాలు ఇవే,లొంగిపోయిన కేడర్లు తెలిపిన కారణాలు

కీలక నాయకుల మరణాలు, అరెస్టులు

మావోయిస్టు సిద్ధాంతంపై నమ్మకం కోల్పోవడం

ప్రజా మద్దతు తగ్గడం

ప్రభుత్వ పునరావాస పథకాల ఆకర్షణ తో లొంగిపోతున్నామని తెలిపారు.

ఏపీ పోలీసుల వ్యూహాత్మక చర్యలతో మావోయిస్టు ఉద్యమం రాష్ట్రంలో తీవ్రంగా క్షీణించినట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఆదివాసీ చట్టాలు అమలు చెయ్యాలి



**ప్రజావినికిడి,(వాజేడు):మార్చి 31,** ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసి చట్టాలపై వాజేడు మండల తాసిల్దార్ కు జిల్లా ఉపాధ్యక్షులు సిద్దబోయిన,సర్వేశ్వరరావు,తొర్రెం సంతోష్,చాప లక్ష్మణ్ వినతి పత్రం అందజేశారు.శతాబ్దల కాలం పాటు ఎల్ టి ఆర్ చట్టం, 1/70 చట్టాలను ఉల్లంఘించి, ఆదివాసి హక్కులను కాలరాస్తూ షెడ్యూల్డ్ ఏరియా లో గిరిజనేతరులు ఫెర్టిలైజర్ ప్రేట్ సైడ్స్ షాపుల లైసెన్సులు అత్యధిక స్థాయిలో ఇస్తున్నారు. చట్ట వ్యతిరేకమైన గిరిజనేతరుల షాపుల లైసెన్సులను రద్దు చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతంలోకి శతాబ్ద కాలంలో జరిగిన సంఘటనలు మళ్లీ పునరావృతం అవుతున్నాయి. ఆంధ్ర ఇతర రాష్ట్రాల నుంచి వడ్డీ వ్యాపారస్తులు (వారం ఫైనాన్స్) అధిక వడ్డీ రేటు తో ఆర్థిక అవసరమున్న వారికి వలవేసి గిరిజన ప్రజలు, గిరిజనేతర ప్రజలను వడ్డీల ఊబిలోకి దించి ప్రజల రక్తం త్రాగుతున్న ఏజెన్సీలో నిషేధించిన మైక్రో ఫైనాన్స్ నడుపుతున్న ప్రతిఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ని కోరడమైనది. ఏజెన్సీ ప్రాంతంలో అరకొర అవకాశాలు ఉన్నా ఆదివాసుల చట్టాలను ప్రభుత్వం స్పందించి చేయాలని ఆదివాసి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు .

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఎస్సీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**ప్రజావినికిడి, (ముషీరాబాద్):** చేవెళ్ల డిక్లరేషన్ సాక్షిగా ఎస్సీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎస్సీల సంక్షేమ పథకాల సాధనకై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం మాట్లాడుతూ,గత ప్రభుత్వ హయాంలో ఎస్సీలు తీవ్ర మానసిక ఆర్థిక ఇబ్బందులు పడ్డారని ఏదైనా సంక్షేమ పథకాలు అమలుకు ముఖ్యంగా ఆరోగ్య భద్రత కార్డ్ ఎంతో అవసరమని దళితులకు రేషన్ కార్డులు ఇవ్వకుండా సంక్షేమ పథకాలు అందకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్క పేద ప్రజలకు రేషన్ కార్డు మంజూరు చేసి గడపగడపకు సంక్షేమ పథకాలు అందజేసిందని గుర్తు చేశారు. దళితులకు ఇచ్చిన హామీ ప్రతి ఒక్కటి అమలు చేస్తామని ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి హామీల అమలకు కృషి చేస్తానన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పేద ప్రజలకు రుణాల సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతిపక్షాలుగా ఉన్న బి ఆర్ ఎస్ బిజెపి పార్టీలు ఎస్సీల అభివృద్ధి కోసం ఎందుకు స్పందించడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాలలో దళితుల సమస్యల పట్ల మాట్లాడకపోవడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దళితులపై దాడులు దౌర్జన్యాలు హత్యలు జరుగుతున్న ప్రతిపక్షాలు మాట్లాడరు. ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులు మాట్లాడరు.

మా ఓటు ఎంత ముఖ్యమో మా అభివృద్ధి కూడా అంతే ముఖ్యమన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 12 సంవత్సరాలుగా ఎలాంటి ఉపయోగం లేని శాఖగా నిర్వీర్యం చేశారన్నారు. కార్పొరేషన్ నిధులు దారి మళ్లించి అనేక సమస్యలపై ఎస్సీ కార్పొరేషన్ కి మొండి చేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం అంబేద్కర్ అభయహస్తం స్కీం కింద ప్రతి ఇంటికి 12 లక్షల రూపాయల సంక్షేమ పథకం అమలు చేస్తామని బహిరంగంగా ప్రకటించి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కెసిఆర్ ప్రభుత్వాన్ని భరించలేక ఎస్సీలంతా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేశామని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి హామీల అమలులో వెనకబడ్డారన్నారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమి కేటాయించాలి. జీవో నంబర్ 50, 58 ప్రకారం పట్టాలు ఇచ్చి అమ్ముకునే హక్కు కల్పించాలి. విద్య హక్క చట్టం ప్రకారం కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25% ఉచిత విద్యను కచ్చితంగా అమలు చేయాలి. ఎస్సీ కార్పొరేషన్ నిధులు కార్పొరేషన్ శాఖకు 15 వేల కోట్ల కేటాయించి, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. భూ హక్కులు అసైన్డ్ భూములను అమ్ముకునే విధంగా పట్టాలు మంజూరు చేసి దళితుల వద్ద నుండి లాక్కున్న అసైన్డ్ భూములను తిరిగి ఇవ్వాలి. కార్మికుల గుర్తింపు పారిశుద్ధ కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి 20వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్..లీడ్ క్యాప్ భూముల పునరుద్ధరణ చేసి తోళ్ల పరిశ్రమలకు పదివేల కోట్లు కేటాయించి చైర్మన్ నియమించి లెదర్ పరిశ్రమల ఏర్పాటు చేసి ఎస్సీ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్, రాష్ట్ర యువసేన అధ్యక్షులు మంచాల యాదగిరి,మాదిగ కార్మిక శాఖ రాష్ట్ర అధ్యక్షులు చింత బాబు. జాతీయ ప్రధాన కార్యదర్శి జిడి నరసింహ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొల్లం జ్యోతి. జాతీయ కార్యదర్శి కోంద్ర ఎల్లయ్య రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాస్టర్ చించొడ్ దేవదాసు ఎన్నిక.



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాస్టర్ దేవదాసు ఎన్నికయ్యారు సోమవారం నాడు షాద్ నగర్ పట్టణంలోని సూర్య కాలనీలో గల మరనాత విశ్వాస ప్రార్థన మందిరంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు మాజీ అధ్యక్షులు పాస్టర్ స్వామి దాస్ ఆధ్వర్యంలో పాస్టర్ అభిషేక్ అబ్రహం పాస్టర్ దేవదాసు నామినేషన్లు దాఖలు చేయగా, పాస్టర్ అభిషేక్ పై దేవదాసు గెలుపొందారు. గెలుపొందిన అభ్యర్థి పాస్టర్ దేవదాసు ను ఎన్నికల అధికారులుగా ఉన్న పాస్టర్ డేవిడ్,పాస్టర్ జేసాన్ అధ్యక్షుడిగా ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పాస్టర్ దేవదాసు మాట్లాడుతూ, నాపై నమ్మకంతో నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు క్రైస్తవుల సమస్యలపై నిరంతరం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు ఎవరికీ ఎలాంటి సమస్యలు వచ్చినా నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఆఫ్ ఎస్సిపి డబ్ల్యూఏ బిషప్ జోసఫ్ అంజన్న, గౌరవ అధ్యక్షులు పాస్టర్ సామెల్, పాస్టర్లు డేవిడ్,పీటర్,సిహెచ్ కృష్ణపాల్,జోసఫ్ ఫ్రాంక్లిన్,వై ఆశీర్వాదం,పాస్టర్ వై మురళి,పి యాకోబు,పి.మాణిక్యం,ఆర్ సి దేవదాసు,డిఎం పాల్,తలారి జోసఫ్,ఎలీషా,రవి,సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక మాఫియా దందా

## చింతకుంట,ముష్టిపల్లి, జాకారం తండాలలో యథేచ్ఛగా ఇసుక దందా అరికట్టాలని తహశీల్దార్‌కు వినతి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా జిల్లెడ్ చౌదరిగూడ మండల పరిధిలోని చింతకుంట తండా,ముష్టిపల్లి తండా మరియు జాకారం తండాల పరిసరాల్లో గత కొంతకాలంగా అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా రాత్రిపూట ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విచ్చలవిడి ఇసుక తోడకం వల్ల వాగుల ఉనికి దెబ్బతింటోందని, భారీ వాహనాల వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు,రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

## మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్



**ప్రజావినికిడి(కొత్తూర్):** ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలని కొత్తూర్ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. సోమవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అక్కివేణి గూడలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్,కౌన్సిలర్ మాధవి గోపాల్ గౌడ్,గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు. ఆలయ అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజ ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,గ్రామ ప్రజలందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం చేస్తున్న గ్రామ ప్రజలకు, సహకారం అందిస్తున్న దాతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో జీవించాలని ఆమె ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నరేందర్, రాజు, సురేష్, సంజీవ, రామచంద్రయ్య,జంగయ్య,ప్రకాష్, రాములు,తదితరులు పాల్గొన్నారు.



# ఏప్రిల్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతాం

## టీవీఏఈ జేఏసి రాష్ట్ర నాయకులు కావలి వెంకటేష్ హెచ్చరిక





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు.

డివిజన్ జేఏసీ చైర్మన్ కే.ఆంజనేయులు,కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీవీఏఈ జేఏసీ రాష్ట్ర నాయకులు కావలి వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆర్టిజన్ కార్మికులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. విద్యుత్ ఉద్యోగులతో సమానంగా ఆర్టిజన్లకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్లకు ఏపీఎస్సిబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని కోరారు. అన్మ్యాన్డ్,సొసైటీ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలన్నారు. పీస్ రేట్ కార్మికులు,ప్రైవేట్ కలెక్షన్ ఏజెంట్లు,మీటర్ రీడర్లు,ఎస్పీఎం కార్మికులు,హమాలీలకు జీవో నం.11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2026 పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్టిజన్లు,అన్మ్యాన్డ్ వర్కర్లు,స్పాట్ బిల్లర్లు,ఎస్పీఎం వర్కర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఏప్రిల్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు హెచ్చరించారు. న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మె మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు శేఖర్,యాదగిరి, రఘుపతి జేఏసీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి (33) ఫిర్యాదులు..



**ప్రజావినికిడి,(రంగారెడ్డి):** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (33) ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలని అన్నారు. రెవెన్యూ శాఖ..08,ఇతర శాఖలు 25, మొత్తం 33 దరఖస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లుసంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అత్తాపూర్‌లో దారుణ ఘటన

## మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

**హైదరాబాద్,మార్చి: 30ప్రజావినికిడి** హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఒక దారుణ ఘటన ఇప్పుడు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తోంది. కనీసం తనపై జరుగుతున్న దాడిని కూడా అర్థం చేసుకోలేని, తన గోడును ఎవరికీ చెప్పుకోలేని ఒక మతిస్థిమితం లేని యువతిపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాసన్ నగర్‌లోని మతిస్థిమితం సరిగ్గా లేని ఒక యువతిపై ఈ అఘాయిత్యం జరిగింది. యువతి ఒంటరిగా ఉన్నది గమనించిన ఒక యువకుడు ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడ నుంచి పారిపోయాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు యువతి పరిస్థితి గమనించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిదింతుడు అదే ప్రాంతానికి చెందిన అఖిల్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల కోసం యువతిని ఆస్పత్రికి తరలించారు.

# నగరంలో మరోమారు డ్రగ్స్ కలకలం

## మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్

**హైదరాబాద్,మార్చి: 30ప్రజావినికిడి :** హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. మోకిలలో డ్రగ్స్ విక్రయిస్తున్న డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి రైల్వేశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. సదరు వ్యక్తి.. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా రైల్వే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గూగుల్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పాటూ మరో వ్యాపారవేత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ధాన్యం కొనుగోలు పై అవగాహన సదస్సు




**ప్రజావినికిడి,(రంగారెడ్డి):**



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సంబంధిత అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్ లో పండించిన ధాన్యం కొనుగోలు చేయుటకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని,ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు.రైతులు ధాన్యం తీసుకు వచ్చిన వెంటనే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు.

సన్నరకం వరి, ముతక రకాలను వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వేరు చేయాలని, ఎంట్రీని రోజువారీ ప్రాతిపదికన చేయాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని,రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్ లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని, ధాన్యం నిల్వలు తరలించేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు,గన్నీ బ్యాగులు,ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టార్పాలిన్‌లు, ప్యాడీ క్లీనర్‌లు, తూనికలు,పొట్టు రిమూవర్,ఫీల్డ్ బ్యాలెన్స్‌లు,తేమ యంత్రం,వంటి అన్ని మౌలిక సదుపాయాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత,సివిల్ సప్లైస్ డీ.ఎం హరీష్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా, పిడి డీఆర్డీఏ శ్రీలత,జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్,డీసీఓ సుధాకర్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# చిత్తశుద్ధి ఉంటే ఓవైసీపై చర్య తీసుకోండి

## బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్

**న్యూఢిల్లీ,మార్చి: 30ప్రజావినికిడి**



హేట్ స్పీచ్ బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే, మొదట తెలంగాణ ప్రభుత్వం.. అక్బరుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రాజ్యసభలో ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావనకు తీసుకువస్తే కాంగ్రెస్ సహా విపక్షాలు అడ్డుకున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్, అన్ని విపక్షాలు ఏకమై తన గొంతు నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఓబీసీల్లో ముస్లింలను మూకుమ్మడిగా చేరుస్తున్నారని.. ఓబీసీలు వెనకపడటానికి కారణమవుతున్నారని ఆరోపించారు. ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ అన్నారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో సహా అందరూ అడ్డుకున్నారని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని కులంగా గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చిందని... 4 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్లు ఎంపీ చెప్పారు. బెంగాల్, తమిళనాడు, కేరళ, తెలంగాణలోనూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. పోటీపడి ఒక వర్గం ఓట్ల కోసం కక్కుర్తి పడుతున్నారని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల స్థానాల్లో ముస్లింలే పోటీ చేశారన్నారు.

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

## వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి

## గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

## సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

**హైదరాబాద్ మార్చి: 30ప్రజావినికిడి**



జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు.

# స్వరాష్ట్రంలో అరెస్టులు సిగ్గు చేటు..

## జర్నలిస్ట్ కేపీ,మాజీ జెడ్పీటీసీ వెంకట్రాంరెడ్డిల అరెస్టు..

అసెంబ్లీ ముట్టడి కోసం షాద్ నగర్ పోలీసుల ముందస్తు చర్యలు.. - ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేరేందుకు జైలుకెళ్ళడానికైనా సిద్ధమే..






**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ ఈనెల 30న అసెంబ్లీని ముట్టడిస్తామని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల పిలుపుకు ప్రభుత్వం స్పందించి ముందస్తు చర్యలను చేపట్టింది.సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ పోలీసులు తెలంగాణ ఉద్యమకారులను అదుపులోకి తీసుకున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు,మాజీ జెడ్పిటిసి పి వెంకటరామ్ రెడ్డి,సీనియర్ జర్నలిస్టు వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎండి ఖాజాపాషా (కేపి)లను ముందస్తు అరెస్టులు చేశారు.వారి ఇళ్ల వద్ద నుండి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక ప్రకారం స్థానిక పోలీసులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు పలువురి అరెస్టు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు,కాంగ్రెస్ నాయకుడు పి. వెంకట్రాంరెడ్డి,జర్నలిస్ట్ కేపీ పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించింఛాయనీ,అధికారంలోకి రావడానికి ముందు తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు,హెల్త్ కార్డులు,250 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.25 వేల గౌరవ పెన్షన్ అందజేస్తామని,అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. ఉద్యమకారులకు సంక్షేమ ఫలాలు దక్కడానికి తాము జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు.స్వరాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యమకారులకు భయపడి అరెస్టులకు పాల్పడడం హాస్యాస్పదమని అన్నారు.

# దూసకల్ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**

గ్రామంలో ఆరవ వార్డు లో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు సోమవారం రోజు శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచేసిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి చల్ల శ్రీకాంత్ రెడ్డి హాజరై అండర్ డ్రైనేజ్ పనులను ప్రారంభించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రజల సమస్య పరిష్కారాలలో నేను ఎల్లప్పుడూ ముందు ఉంటాను అంటూ ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామంలో పరిశుభ్రత ఆరోగ్య పరిరక్షణ కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా,గ్రామాభివృద్ధిలో పారిశుధ్యం కీలకమని పేర్కొన్నారు.గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి అవసరం అని తెలిపారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ అమలులోకి రావడంతో వర్షాకాలంలో నీరు నిల్వ సమస్యలు తగ్గి,గ్రామంలో శుభ్రమైన



వాతావరణం ఏర్పడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో దూసకల్ గ్రామ సెక్రెటరీ మరియు,సర్పంచ్ జ్యోతిర్మయి అంజి, ఉపసర్పంచ్, ఐనాల కుమార్, వార్డ్ మెంబర్లు లింగారం మహేష్ ,ఖజపాష,ఐనాల రవి,సంగెం కృష్ణ అలాగే గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు , లింగారం యాదయ్య,నజీర్, ఆంజనేయులుగౌడ్ లక్ష్మయ్య



అర్షద్,ఫయాజ్ నయీం,అశోక్,కుమ్మరి శివ వెంకటేష్,డిజె యాదయ్య,పండ్ల శీను అలాగే గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.చివరిగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ గ్రామ అభివృద్ధికోసం తన పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మరోసారి తెలిజేసారు.

# మా భూమిలో ఏర్పాటుచేసిన బోర్డును తక్షణమే తొలగించండి..

జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన మహమ్మద్ అర్షద్ - షాద్ నగర్ శ్రీ వెంకటేశ్వర కాలనీకి ప్రభుత్వ పార్క్ స్థలం లేదు..

స్థలంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయం పాతిన బోర్డులు తొలగించేలా చర్యలు తీసుకోండి..

సర్వేనెంబర్ 25, 28లలో ప్రకారం లేఅవుట్ రికార్డులు లేనట్లు సమాచార చట్టం ద్వారా వెల్లడి..

**ప్రజావినికిడి ,(షాద్ నగర్):**

మాకు సంబంధించిన స్థలంలో మున్సిపల్ కార్యాలయం తరఫున బోర్డు పాతడం చట్ట విరుద్ధమని దీనిని వెంటనే తొలగించేలా షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జరిచేయాలని తమకు న్యాయం చేయాలని ఉపాధితులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాడు. షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ లోని సర్వేనెంబర్ 25, 28 లలో లేఅవుట్ అనుమతి లేదని సమాచార హక్కు చట్టం ద్వారా బాధితుడు జవాబు పొందడంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాడు. పట్టణానికి చెందిన మహమ్మద్ అర్షద్ ఈ సందర్భంగా చట్ట ప్రకారం తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఇటీవల పట్టణంలో ఫరూక్ నగర్ నాగులపల్లి రోడ్ లో ఉన్న శ్రీ వెంకటేశ్వర వెంచర్ లో స్థలం చదును చేసిన నేపథ్యంలో మీడియా ఇది పార్కు స్థలమని వెంచర్ కు సంబంధించిన స్థలమని ఇంటి స్థలాల యజమానులు మున్సిపాలిటీకి ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి స్పందించి సదరు స్థలంలో కార్యాలయ తరఫున ఈ స్థలం మున్సిపాలిటీ దేనని బోర్డును పాతారు.దీంతో బాధితుడు స్థానిక మున్సిపాలిటీలో మార్చి 28న సమాచార హక్కు చట్టం కింద లేఖ సంఖ్య జీ1 / ఆర్టిఐ/433/2026 ప్రకారం జవాబు పొందారు. ఇందులో సంధించిన ప్రశ్నలలో 25 మరియు 28 సర్వే నెంబర్లలో లేఅవుట్ లేదని సమాధానం ఇచ్చారు. అదేవిధంగా గతంలో లేఅవుట్ కోసం దరఖాస్తు చేసుకున్నారా? దీనికి సంబంధించిన ఏవైనా రికార్డులు ఉన్నాయని ప్రశ్నించగా అవి ఏమీ లేవని సమాధానం లభించింది. సంబంధిత సర్వే నెంబర్లలో 10 శాతం భూమి కానీ రోడ్డు కానీ మున్సిపాలిటీ పేరు లేదా గ్రామ పంచాయతీ పేరు రిజిస్ట్రేషన్ అయ్యిందా అని కోరగా కార్యాలయంలో రికార్డులలో కోరిన సమాచారం లేదని జవాబు




లభించింది. దీంతో బాధితుడు మహమ్మద్ హర్షద్ అదే రోజు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ అంశంపై దరఖాస్తు చేసుకున్నాడు.

**కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన అంశాలలో..**

యెద్దుల స్వర్ణ భూపాల్ అలాగే ముజావర్ మక్బుల్ బాషాలు సర్వేనెంబర్ 28 జుజు 3.27 ఎకరాలలో భూమిని కొనుగోలు చేసారు.అదేవిదంగా 28యు అలాగే 38యుయు లలో 7 ఎకరాల 13 గుంటలు,28/జు (01-00), 25/ూ మరియు 28/జు (02-00) ఎసి.17-20 గుంతలను పూర్తిగా అడ్మిషన్‌గా ఉంది. ఫరూఖ్‌నగర్ రెవెన్యూ గ్రామం, షాద్‌నగర్ పట్టణం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లాలో రిజిస్టర్ అయినప్పటికీ. సేల్ డీడ్ నెం.194/200, 2793/1999. 1858/2000, 1993/2000 మరియు 3564/1999. యెద్దుల స్వామి భూపాల్ రెడ్డి, ముజవర్ షరీఫా బీ,ముజవర్ ముస్తాఖ్ బాషా అలాగే మసూద్ బాషా,దస్తావేజు నెం.26/2026, తేది. 10-02-2026 ద్వారా,నన్ను అలాగే మహ్మద్ ఖాజా పాషాను వారి చట్టబద్ధమైన అటార్నీగా నియమిస్తూ, మాకు అనుకూలంగా ఒక రిజిస్టర్డ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీని అమలు చేశారని కలెక్టర్ కార్యాలయంలో విన్నవించడమైనది

ఇక్కడ తెలియజేయవలసిన విషయం ఏమిటంటే, ఇటీవల షాద్‌నగర్ మున్సిపాలిటీ కమిషనర్ పైన పేర్కొన్న భూమి "మున్సిపల్ భూమి" అని పేర్కొంటూ,ఆ భూమి వద్ద పొరపాటున ఒక బోర్డును ఏర్పాటు చేశారనీ, వాస్తవానికి, ఫరూఖ్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్లు 25 అదేవిదంగా 28లో ఉన్న పైన పేర్కొన్న ఖాళీ స్థలం అస్సలు కేటాయించబడిన భూమి కాదు, ప్రభుత్వ భూమి కాదు,లేదా మున్సిపల్ భూమి కూడా కాదు.నేను ఈ సమాచారాన్ని ఆర్టీఐ చట్టం 2005 క్రింద,లెటర్ నెం. G1/RTI/433/2026,/~ 28`03`2026 ద్వారా షాద్‌నగర్ మున్సిపాలిటీ కమిషనర్ నుండి పొందాను. అందులో,సర్వే నంబర్లు 25 & 28లో షాద్‌నగర్ మున్సిపాలిటీకి ఎటువంటి భూమి లేదని సదరు అధికారి పేర్కొన్నట్లు కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన పత్రంలో పేర్కొన్నారు.దీనిపై మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి వివరణ ఇస్తూ రికార్డులలో సదరు భూమి గురించి ఇలాంటి వివరాలు లేవని అయితే దీని గురించి పూర్తి అంశాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !



**అమరావతి,మార్చి: 30ప్రజావినికిడి**
ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవు తుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయిం పులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మిషన్ భగీరథ ప ఏరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆర్ఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్దరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెటెక్కుతారు. నదీ జలాలలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికులు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుఉతంది.

# నవనీత కృష్ణాలంకారంలో రాములవారు

## స్వామిని దర్శించుకుని పులకించిన భక్తులు -ఒంటిమిట్ట కళ్యాణానికి తిరుమల శ్రీవారి లడ్డూ


**ఒంటిమిట్టమార్చి: 30ప్రజావినికిడి**
ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఏప్రిల్ 1వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 85 వేల తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ 1లో శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్‌ను టీటీడీ ఒక బృహత్కార్యక్రమంగా నిర్వహించింది. ఈ లడ్డూల ప్యాకింగ్ కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు అపార భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి,డిప్యూటీ ఈవో వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో లడ్డూ ప్యాకింగ్ నిరంతరాయంగా సాగింది. లడ్డూల ప్యాకింగ్, లోడింగ్, రవాణా వంటి అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు.





# ఆర్థిక సంవత్సరం చివరి రోజున... కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**అమరావతి,మార్చి: 30ప్రజావినికిడి**
ఈ ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజున భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలు దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ పరిణామాలతో పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సెన్సెక్స్, నిఫ్టీ కుప్పకూలాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,635.67 పాయింట్లు నష్టపోయి 71,947.55 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ 488.20 పాయింట్లు పతనమై 22,331.40 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ కీలకమైన 22,500 మద్దతు స్థాయిని కోల్పోవడం మార్కెట్‌లో మరింత బలహీనతకు సంకేతమని విశ్లేషకులు చెబుతున్నారు.



22,500–22,600 స్థాయి నిఫ్టీకి తక్షణ నిరోధకంగా మారవచ్చని అంచనా వేస్తున్నారు.
ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ షేర్లు నిఫ్టీలో టాప్ లూజర్లుగా నిలిచాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ మాత్రమే లాభపడగా.. బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి షేర్లు భారీగా నష్టపోయాయి.
లార్జ్‌క్యాప్ షేర్లతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా పతనమయ్యాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.68 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.66 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. మిడిల్ ఈస్ట్‌లో ఇరాన్ దాడులు విస్తరించడం, ఘర్షణల్లోకి హౌతీలు ప్రవేశించడం, అమెరికా బలగాల మోహరింపు వంటి పరిణామాలు ద్రవ్యోల్బణంపై ఆందోళనలను పెంచాయని, దీంతో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడుల వైపు మళ్లారని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన



**వాషింగ్టన్,మార్చి: 30ప్రజావినికిడి** ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

# నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

## సింగరేణికి సమంబందించి పలు సూచనలు చేసిన కాగ్

**హైదరాబాదమార్చి: 30ప్రజావినికిడి**
తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.



# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

## స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు

**హైదరాబాద్,మార్చి: 30ప్రజావినికిడి** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్ ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ధమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750 రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం

## 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ -నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు

## ప్రయాణికుల భద్రత కోసమే అన్న మంత్రి రాంప్రసాద్



**అమరావతి,మార్చి: 30ప్రజావినికిడి**
ఏపీలో రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా రవాణ శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా.. ఓవర్ లోడ్‌తో నడుపుతున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న, నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు నమోదు చేసి, భారీగా జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రధాన పాయింట్లలో ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొంతమంది బస్సు యజమానులు ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులను తరలిస్తూ.. అధిక లోడ్‌తో బస్సులను నడుపుతున్నారని చెప్పారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలను పాటించాలని చెప్పారు. ప్రయాణికుల క్షేమమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి పేర్కొన్నారు.

# సిఎస్‌కే బ్యాటర్ల విఫలం

**127 పరుగులకే కుప్పకూలిన చెన్నై**

**టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన సూపర్ కింగ్స్**

**ఓవర్టన్ ఇన్నింగ్స్ నిలబెట్టడంతో గౌరవప్రదమైన స్కోరు**



**గౌహతి,మార్చి30:** చెన్నై జట్టు 19.4 ఓవర్లలో 127 పరుగులకు చేరుకుని ఆలౌట్ అయ్యింది. రాజస్థాన్ ముందు 128 పరుగుల లక్ష్యాన్ని విధించింది. ఐపీఎల్ 2026 సీజన్ లో భాగంగా సోమవారం గుహవటిలో చెన్నై సూపర్ కింగ్స్ రాజస్థాన్ రాయల్స్ తో తలపడింది. ముందుగా టాస్ గెలిచిన రాజస్థాన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాంటింగ్ కు దిగిన చెన్నై ఆటగాళ్లు రాజస్థాన్ బౌలర్ల ధాటికి పెవిలియన్‌కు క్యూ కట్టారు. టాప్ ఆర్డర్ నుంచి మిడిల్ ఆర్డర్ వరకు ఏ ఒక్కరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. పవర్‌ప్లే ముగిసేసరికే ముగ్గురు కీలక బ్యాటర్లు పెవిలియన్‌కు చేరారు. రాజస్థాన్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తన వేగంతో చెన్నై ఓపెనర్లను బెంబేలెత్తించాడు. ఆ తర్వాత వచ్చిన మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు కూడా స్పిన్నర్ల ఉచ్చులో చిక్కుకున్నారు. ముఖ్యంగా రాజస్థాన్ తరపున ఆడుతున్న మాజీ సీఎస్‌కే ఆటగాడు రవీంద్ర జడేజా, తన పాత జట్టుపై కనికరం లేకుండా బౌలింగ్ చేసి కీలక వికెట్లు పడగొట్టాడు. ఒకానొక దశలో చెన్నై స్కోరు 80 పరుగుల వద్దే 7 వికెట్లు కోల్పోయి అత్యల్ప స్కోరుకే పరిమితమవుతుందని అభిమానులు ఆందోళన చెందారు. జట్టు పీకల్లోతు కష్టాల్లో ఉన్న సమయంలో జేమీ ఓవర్టన్ (43 పరుగులు) ఆపద్బాంధవుడిలా ఆదుకున్నాడు. టెయిలెండర్లతో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పిన ఓవర్టన్, రాజస్థాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కొన్ని భారీ సిక్సర్లు, ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతని పోరాట పటిమ వల్లే చెన్నై జట్టు 19.4 ఓవర్లలో 127 పరుగులకు చేరుకుని ఆలౌట్ అయ్యింది. గౌరవప్రదమైన స్కోరు సాధించడంలో ఓవర్టన్ ఇన్నింగ్స్ కీలకంగా మారింది. ఞాజస్థాన్ బౌలింగ్ విభాగం అత్యంత క్రమశిక్షణతో బౌలింగ్ చేసింది. నాంద్రే బర్గర్, జోఫ్రా ఆర్చర్ తలా 2 వికెట్లు తీసి పేస్ అటాక్‌ను ముందుండి నడిపించారు. రవీంద్ర జడేజా తన స్పిన్ మ్యాజిక్‌తో మధ్య ఓవర్లలో చెన్నైని కోలుకోకుండా చేశాడు. రాజస్థాన్ రాయల్స్ ముందు ఇప్పుడు 128 పరుగుల స్వల్ప లక్ష్యం ఉంది. పిచ్ బౌలింగ్‌కు సహకరిస్తుండటంతో, చెన్నై బౌలర్లు కూడా గట్టిగా పోరాడితే మ్యాచ్ ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది.

# బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపాలి

- వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌పై శ్రీకాంత్ పెదవి విరుపు



**చెన్నై,మార్చి30:** టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గత కొంత కాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. టీ20 ప్రపంచ కప్ 2026 ఆదిలో అద్భుతంగా బౌలింగ్ వేసిన వరుణ్.. క్రమంగా గతి తప్పి భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. ఐపీఎల్‌లోనూ అదే రీతి కొనసాగుతోంది. కేకేఆర్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోన్న అతడు.. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి 48 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. దీంతో అతడి బౌలింగ్ శైలిపై టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు.'బంతిని విభిన్నంగా వేయడం, లెగ్ స్పిన్ సంధించడాన్ని నేర్చుకోనంత వరకు వరుణ్ చక్రవర్తి ఇబ్బందిపడుతూనే ఉంటాడు. ఎప్పుడూ గూగ్లీలు వేయడం వర్కౌట్ అవ్వదు. బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపించాలి. కొన్నిసార్లు లెగ్ స్పిన్ వేయాలి. ఇప్పుడైతే అతడి బౌలింగ్‌లో ఎలాంటి మిస్టరీ లేదు. అదంతా హిస్టరీగా మారిపోయింది. బ్యాటర్లకు కాస్త దూరంగా బంతిని విసరాలి. అప్పుడు షాట్లు కొట్టేందుకు ప్రయత్నించి వికెట్లు ఇస్తారు. దీంతో తర్వాత వచ్చే బ్యాటర్లు కాస్త జంకుతారు. ఇక్కడ ఆయా జట్ల సారథులకూ ఓ మాట చెబుతున్నా. ఇప్పుడు వరుణ్‌కు పవర్ ప్లేలో బౌలింగ్ ఇవ్వొద్దు. ముంబైతో మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఇలానే వరుణ్ వేసిన తొలి ఓవర్లో దూకుడుగా పరుగులు రాబట్టాడు. దాంతో వరుణ్ ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది' అని క్రిష్ శ్రీకాంత్ వెల్లడించాడు.

# వర్షంతో ఆలస్యంగా మ్యాచ్ ప్రారంభం







**గౌహతి,మార్చి30:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌ను వరుణుడు పలకరించాడు. ఎడిషన్‌లో మూడో మ్యాచ్ టాస్ వర్షం కారణంగా ఆలస్యం కానుంది. ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండడంతో రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ టాస్ ఐదు నిమిషాలు ఆలస్యమైంది. టాస్ గెలిచిన రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ బౌలింగ్ తీసుకున్నాడు. తొలి సీజన్ ఛాంపియన్ రాజస్థాన్ రాయల్స్, ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ గువాహటిలో అమీతుమీకి సిద్ధమయ్యాయి. వేలానికి ముందు రవీంద్ర జడేజా, సంజూ శాంసన్‌లను మార్చుకున్నందున ఈ మ్యాచ్‌పై అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. టాస్ గెలిచిన రియాన్ పరాగ్ ఛేదనకే మొగ్గు చూపడంతో సీఎస్కే మొదట ఆడనుంది. ఈసారి ట్రోఫీ గెలవడమే తమ లక్ష్యమని చెప్పిన పరాగ్.. విజయంపై ధీమా వ్యక్తం చేశాడు. షార్ట్, ఓవర్టన్, నూర్, మ్యాట్ హెన్రీలను ఆడిస్తున్నామని సీఎస్కే సారథి రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు.

# వివాదంలో ఫుట్‌బాల్ ఫెడరేషన్ చీఫ్ కల్యాణ్ చౌబే

**వేధింపు ఆరోపణలు చేసిన మహిళల ఫుట్‌బాల్ కమిటీ ఛైర్మన్ వాలంకా**



**న్యూఢిల్లీ,మార్చి30:** ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ చీఫ్ కల్యాణ్ చౌబేపై వివాదంలో చిక్కుకున్నారు. ఆయనపై ఏఐఎఫ్ఎఫ్ మహిళల ఫుట్‌బాల్ కమిటీ ఛైర్మన్ వాలంకా అలెమావో వేధింపుల ఆరోపణలు చేశారు. మార్చి 29న దిల్లీలోని ఫుట్‌బాల్ హౌస్‌లో జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. తనను సీనియర్ అధికారులు హేళన చేశారని, వేధించారని ఆరోపించారు. భారత మహిళల ఆసియా కప్ క్యాంపెయిన్‌లో భాగంగా పాలనాపరమైన లోపాలను ఇటీవల ఆమె ఎత్తిచూపిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం.చౌబే, ఇతర సీనియర్ అధికారుల చర్యలను ప్రస్తావిస్తూ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కు అలెమావో లేఖ రాశారు. 'చౌబే, ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.హారిస్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.సత్యనారాయన్ ప్రవర్తనను మీ ముందు ఉంచాలనుకుంటున్నాను. నా గొంతు అణచివేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అధ్యక్షుడు నాతో అగౌరవంగా ప్రవర్తించారు. ఆయనతో కలిసి మిగిలినవారు స్వరం పెంచి, బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. సమావేశం జరుగుతున్నంతసేపు నన్ను టార్గెట్ చేశారని ఆమె ఆరోపించారు. ఇండియా ఫుట్‌బాల్ పాలకవర్గంలో వాలంకా కీలక వ్యక్తి. చర్చిల్ బ్రదర్స్ ఫుట్‌బాల్ క్లబ్ గోవాకు ఆమె సీఈఓగా ఉన్నారు. ఆమె తండ్రి చర్చిల్ అలెమావో గోవా ముఖ్యమంత్రిగా పని చేశారు. కొన్నేళ్ల పాటు ఆ క్లబ్‌ను నడిపించారు. ఫిఫా మహిళల ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన తొలి భారతీయురాలీమె.2025నుంచి2029 వరకు ఆ హోదాలో కొనసాగుతారు.

# తేలిపోయిన సంజూ శాంసన్




**చెన్నై జట్టులో నిరాశ పర్చిన సంజూ**

**గౌహతి,మార్చి30:** ఐపీఎల్‌లో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ కు ఆడుతున్న సంజూ శాంసన్ మొదటి మ్యాచ్‌లో తేలిపోయాడు. ఎన్నో అంచనాల మధ్య పసుపు జెర్సీతో క్రీజులోకి వచ్చిన సంజూ.. రెండో ఓవర్లోన క్లీన్‌బౌల్డయ్యాడు. నంద్రె బర్గర్ వేసిన ఆ ఓవర్లో చివరి బంతికి డిఫెన్స్ ఆడాలనుకున్న శాంసన్ అంచనా తప్పగా.. బంతి మెరుపు వేగంతో ఆఫ్ స్టంప్‌ను ఎగరగొట్టింది. కోట్లాదిమంది అభిమానగణ మున్న సీఎస్కే తరఫున సంజూ శాంసన్ అరంగేట్రం అదరలేదు. సిక్సర్లతో హోరెత్తిస్తాడని ఆశించిన అభిమానులను నిరాశపరుస్తూ ఆరు పరుగులకే ఔటయ్యాడీ హిట్టర్. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూను నంద్రె బర్గర్ బౌల్డ్ చేశాడు. డిఫెన్స్ ఆడాలనుకున్న అతడి అంచనా తప్పగా బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. తమ మాజీ కెప్టెన్ వికెట్ తీసిన సంతోషంలో బర్గర్ గాల్లోకి ఎగరగా.. సీఎస్కే అభిమానులు 'అయ్యో' అని తలపట్టుకున్నారు.

# రామ్ చరణ్ బీస్ట్ లుక్..

## ఆ కండల వెనుక రహస్యం ఇదే!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన కొత్త చిత్రం 'పెద్ది' కోసం అద్భుతమైన శారీరక మార్పుతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇటీవల ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదలైన టీజర్‌లో, మట్టి అఖారాలో కుస్తీ పడుతున్న పహిల్వాన్‌గా కనిపించి అభిమానులకు భారీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. గ్రామీణ క్రికెటర్‌గా కనిపించిన చరణ్, ఒక్కసారిగా ఈ రఫ్ అండ్ టఫ్ లుక్‌లో దర్శనమివ్వడంతో సోషల్ మీడియాలో ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ హాట్ టాపిక్‌గా మారింది.

అయితే, ఈ బీస్ట్ లుక్ వెనుక ఉన్న అసలు రహస్యం అందరినీ మరింతగా ఆకట్టుకుంటోంది. పూర్తిగా శాకాహారం తీసుకుంటూనే చరణ్ ఈ ఫిజిక్‌ను సాధించడం విశేషం. గడిచిన ఎనిమిది నెలలుగా ప్రతిరోజూ ఉదయం 5:30 గంటలకే నిద్రలేచి కఠినమైన శిక్షణ తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్నప్పటికీ, తన శిక్షణకు ఏమాత్రం ఆటంకం కలగకుండా నియమాలను పాటిస్తూనే ఈ బాడీని బిల్డ్ చేశారు. ఈ శిక్షణలో భాగంగా 'గద' (ముగ్దార్) అనే సాంప్రదాయ వ్యాయామ పరికరాన్ని ఆయన విరివిగా ఉపయోగించినట్లు తెలుస్తోంది. టీజర్‌లో గదను తిప్పుతూ కనిపించిన దృశ్యాలు ఆయన శ్రమకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సాధారణంగా కండలు పెంచాలంటే మాంసాహారం తప్పనిసరి అనే అభిప్రాయాన్ని చరణ్ పటాపంచలు చేశారు. కేవలం కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు వంటి ప్రకృతి సిద్ధమైన ఆహారంతోనే అంతర్జాతీయ స్థాయి ఫిజిక్ సాధ్యమని నిరూపించారు. గతంలో సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్ వంటి స్టార్లు కూడా శాకాహారంతోనే ఫిట్‌నెస్ సాధించి ఆదర్శంగా నిలవగా, ఇప్పుడు చరణ్ కూడా అదే బాటలో నడుస్తూ యువతకు స్ఫూర్తినిస్తున్నారు. ఇక సినిమా విషయానికొస్తే, క్రికెటర్‌గా మొదలై పహిల్వాన్‌గా మారే పాత్ర ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. గత చిత్ర పరాజయం తర్వాత ఈ సినిమాతో చరణ్ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేస్తారని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# హనీ రోజ్‌కు చేదు అనుభవం



తెలుగు, మలయాళ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ హనీ రోజ్‌కు కేరళలో అనూహ్యమైన రీతిలో ఒక చేదు అనుభవం ఎదురైంది. అభిమానుల అత్యుత్సాహం శృతిమించడంతో ఆమె తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. కేరళలోని ఒక నూతన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వెళ్లిన సందర్భంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హనీ రోజ్‌ను చూడటానికి వేల సంఖ్యలో అభిమానులు మాల్ వద్దకు చేరుకున్నారు. ప్రారంభంలో పరిస్థితి సజావుగానే ఉన్నప్పటికీ, ఆమె లోపలికి వెళుతున్న సమయంలో ఒక్కసారిగా జనం సెల్ఫీల కోసం ఎగబడ్డారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు అభిమానం ముసుగులో హద్దులు దాటారు. సెల్ఫీ తీసుకునే నెపంతో ఆమెకు అత్యంత దగ్గరగా రావడమే కాకుండా, ఏకంగా ఆమె నడుమును తాకుతూ అసభ్యంగా ప్రవర్తించారు. అనూహ్యంగా ఎదురైన ఈ పరిణామంతో హనీ రోజ్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తనను ఇబ్బంది పెడుతున్నారని గ్రహించిన ఆమె, వెంటనే ఆ వ్యక్తుల నుంచి దూరంగా జరిగి అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. తారల పట్ల గౌరవం ఉండాలి కానీ, ఇలాంటి వికృత చేష్టలు సరికాదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

# సరికొత్త కథ, కథనాలతో..

ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి శ్రీకాంత్ మొగదాసు – చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న వినూత్న కథాచిత్రం 'మిరాకిల్'లో హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటిస్తోంది.. సీనియర్ హీరోలు సురేష్, శ్రీరామ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో రణధీర్ బీసు హీరో. 'సత్య గ్యాంగ్, 'ఫైటర్ శివ' చిత్రాల దర్శకుడు ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం మూడో షెడ్యూల్ హైదరాబాద్ పరిసర గ్రామమైన 'కొండమడుగు'లో పూర్తిచేసుకున్న సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు, యూనిట్ సభ్యులందరి సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించింది 'మిరాకిల్' చిత్రబృందం. తన కెరీర్ బెస్ట్ ఫిల్మ్‌గా 'మిరాకిల్' నిలిచిపోతుందని ప్రకటించడం ద్వారా ఈ చిత్రంపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది హీరోయిన్ హెబ్బా పటేల్. ప్రభాస్ నిమ్మల మాట్లాడుతూ.. 'ఇప్పటి వరకు మన ఇండియన్ స్క్రీన్‌పై రాని సరికొత్త కథ, కథనాలతో తెరకెక్కుతోంది ఈ చిత్రం' అని తెలిపారు.



# దిల్ రాజు, వంశీ పైడిపల్లితో సల్మాన్ ఖాన్ కొత్త సినిమా.. అధికారిక ప్రకటన

బాలీవుడ్ సీనియర్ హీరో సల్మాన్ ఖాన్ తన అభిమానులకు ఒకేసారి రెండు శుభవార్తలు అందించారు. ఒకవైపు తన కొత్త సినిమాను ప్రకటిస్తూనే, మరోవైపు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన తన తండ్రి సలీం ఖాన్ క్షేమంగా ఇంటికి చేరిన విషయాన్ని పంచుకున్నారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు వంశీ పైడిపల్లితో కలిసి ఓ భారీ ప్రాజెక్ట్ చేయబోతున్నట్టు సల్మాన్ అధికారికంగా ప్రకటించారు.

ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "ఈ ఏప్రిల్ నుంచి దిల్ రాజు, వంశీ పైడిపల్లిలతో కలిసి దిల్, దిమాగ్, జిగర్‌తో వస్తున్నా" అంటూ తన కొత్త సినిమాపై అప్‌డేట్ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనప్పటికీ, ఇది ఒక భారీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా పలు లొకేషన్లలో విస్తృతంగా షూటింగ్ జరపాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఈ సినిమాను 2027 ఈద్ నాటికి విడుదల చేసే అవకాశాలున్నాయని మీడియా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి' అనే యుద్ధ నేపథ్య చిత్రంలో నటిస్తున్నారు. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ఆయన ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన 'సికిందర్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు.




ఇక వ్యక్తిగత విషయానికొస్తే, ఈ నెల 21న జరుపుకున్న ఈద్ పండుగ సందర్భంగా సల్మాన్ తన తండ్రి సలీం ఖాన్‌ను అభిమానుల ముందుకు తీసుకొచ్చారు. కొద్ది రోజుల క్రితం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సలీం ఖాన్‌ను వీల్ చైర్‌లో తన గెలాక్సీ అపార్ట్‌మెంట్ బాల్కనీలోకి తీసుకువచ్చి, అభిమానులకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వీడియోను షేర్ చేస్తూ.. "ఈద్ ముబారక్. మీ ఆశీస్సులకు ధన్యవాదాలు. నాన్న ఇంటికి వచ్చేశారు" అని సల్మాన్ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా సల్మాన్ కుటుంబ సభ్యులందరూ ఆయన వెంట ఉన్నారు. రచయిత జావేద్ అక్తర్‌తో కలిసి సలీం-జావేద్ ద్వయంగా 'షోలే', 'దీవార్', 'జంజీర్', 'డాన్' వంటి ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సలీం ఖాన్ కథ అందించిన విషయం తెలిసిందే.



# కిరణ్ అబ్బవరం.. ఇకపై మరో లెక్క..

యంగ్ హీరోల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కిరణ్ అబ్బవరం ప్రస్తుతం మంచి ఫామ్ లో కొనసాగుతున్నారని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ఇటీవల విడుదలైన సినిమాలతో వరుస విజయాలు అందుకోవడంతో ఆయనను మినిమమ్ గ్యారంటీ హీరోగా అంతా భావిస్తున్నారు. ఆ హిట్స్ ప్రభావంతో కిరణ్ మార్కెట్ బాగా పెరిగింది. అదే సమయంలో కొత్త ఆఫర్లు కూడా వరుసగా వస్తున్నాయి. ఇప్పటివరకు ఒక లెక్కలో ఉన్న కిరణ్ అబ్బవరం కెరీర్, ఇకపై మరో లెక్కలో ఉండబోతుందనే చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో జోరుగా జరుగుతోంది. కారణం ఆయన చేతిలో ఉన్న భారీ లైనప్. ప్రస్తుతం కిరణ్ అబ్బవరం దగ్గర దాదాపు అరడజను ప్రాజెక్టులు ఉన్నట్లు సమాచారం. ఇందులో సినిమాలతో పాటు ఓ వెబ్ సిరీస్ కూడా ఉండటం విశేషమని చెప్పాలి. అయితే కిరణ్ థియేటర్లలో సందడి చేయబోయే ప్రాజెక్టుల్లో చెన్నై లవ్ స్టోరీ చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. లవ్, ఎమోషన్ తో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ తో కూడిన కథతో ఆ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక డిజిటల్ ప్లాట్ ఫామ్ వైపు కూడా కిరణ్ అడుగులు వేస్తున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ కోసం ఆయన గువ్వలచెరువు ఘాట్ వెబ్ సిరీస్ లో నటిస్తున్నారు. డియర్ కామ్రేడ్ దర్శకుడు భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సిరీస్ నుంచి ఇటీవల విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఆ ప్రాజెక్టు ద్వారా కిరణ్ కొత్త కోణంలో కనిపించబోతున్నారని టాక్. అలాగే ప్రముఖ దర్శకుడు సుకుమార్ శిష్యుడైన వీర కోగటం దర్శకత్వంలో కిరణ్ మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాయలసీమ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్ గా ఆ మూవీ తెరకెక్కనుంది. కిరణ్ ఇప్పటి వరకు చేసిన పాత్రలతో పోలిస్తే ఇది భిన్నంగా ఉండబోతుందని టాక్ వినిపిస్తోంది. ఇవి కాకుండా కిరణ్ అబ్బ వరం స్వయంగా దర్శకత్వం వహించే ప్రాజెక్టుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే పనులు దాదాపు పూర్తయ్యాయని సమాచారం.

# నటుడు ప్రకాశ్ రాజ్ ఇంట విషాదం.. తల్లి కన్నుమూత





విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) ఇవాళ ఉదయం బెంగళూరులోని తన స్వగృహంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా వయసు రీత్యా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లి మరణవార్త తెలియగానే ప్రకాశ్ రాజ్ హుటాహుటిన బెంగళూరుకు బయలుదేరారు. తల్లితో ప్రకాశ్ రాజ్‌కు ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైంది. షూటింగ్ లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, ఆయన తరచూ తల్లిని కలుస్తూ ఆమె బాగోగులు చూసుకునేవారు. ఇప్పుడు ఆమె దూరం కావడంతో ఆయన శోకసంద్రంలో మునిగిపోయారు. సువర్ణలత మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు. కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం ఆమె అంత్యక్రియలు ఇవాళ సాయంత్రం బెంగళూరులో జరగనున్నాయి.

ప్రకాశ్ రాజ్ తల్లిదండ్రుల ప్రేమకథ ఒక సినిమాను తలపిస్తుంది. కర్ణాటకలోని హుబ్లీలో ఒక అనాథ శరణాలయంలో పెరిగిన సువర్ణలత, నర్సింగ్ విద్యను అభ్యసించారు. ఆ తర్వాత బెంగళూరులోని ఒక ఆసుపత్రిలో నర్సుగా చేరారు. అదే సమయంలో వ్యవసాయం ఇష్టం లేక మంగళూరు నుంచి వచ్చిన ప్రకాశ్ రాజ్ తండ్రి అనారోగ్యంతో అదే ఆసుపత్రిలో చేరారు. అక్కడ సువర్ణలతను చూసి ప్రేమలో పడి, ఆమెను వివాహం చేసుకున్నారు. ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ప్రకాశ్ రాజ్, ఈరోజు పాన్ ఇండియా నటుడిగా ఎదగడం వెనుక ఆయన తల్లి ప్రోత్సాహం, త్యాగం ఎంతగానో ఉన్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613